క్లుప్తంగా

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తాం



నగరంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న గణేష్‌బాబు

మామిడికుదురు: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత నీతిపూడి గణేష్‌బాబు చెప్పారు. నగరం గ్రామంలో శనివారం పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, పరిశీలకులు మొల్లేటి త్రిమూర్తుల పర్యవేక్షణలో సమావేశం నిర్వహించారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే దిశగా అనుబంధ కమిటీల నియామకం చేపట్టామని గణేష్‌బాబు అన్నారు. పార్టీలో కష్టపడి పని చేసే వారిని అనుబంధ కమిటీల్లో నియమిస్తామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కడలి శ్రీనివాస్, ఆగాబాకర్ హుస్సేన్, బత్తుల గంగారత్నం, వానరాశి బుజ్జి, అన్వర్ తాహిర్ హుస్సేన్, జాలెం నాగరాజు, వానరాశి వెంకటరత్నం, తవిటికి వెంకన్నబాబు పాల్గొన్నారు.

చంద్రబాబు డైరెక్షన్‌లో బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు



రాజోలులో మాట్లాడుతున్న తెన్నేటి కిషోర్

రాజోలు: ముఖ్యమంత్రి చంద్రబాబు డైరెక్షన్‌లోనే హిందుపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అసెంబ్లీ వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేశారని రాష్ట్ర ప్రచార విభాగ అధికార ప్రతినిధి తెన్నేటి కిషోర్ మండిపడ్డారు. శనివారం ఆయన రాజోలులో మాట్లాడుతూ, బాలకృష్ణ గతం మర్చిపోయి మాట్లాడుతున్నారన్నారు. 2004లో ఇద్దరిపై గన్‌తో కాల్పులు జరిపిన ఘటనలో ఆ కేసు నుంచి తప్పించుకునేందుకు బాలకృష్ణ మెంటల్ సర్టిఫికెట్ తెచ్చుకున్నారనే విషయాన్ని మర్చిపోయారన్నారు. మానసిక రోగిగా ధ్రువపత్రం ఉన్న వ్యక్తిని ఎమ్మెల్యేగా అనర్హుడని ప్రకటించాలన్నారు. సినీ పరిశ్రమలో అతి పెద్ద సైకోగా బాలకృష్ణ పేరుగాంచారని, అతని అభిమానులపై ఆయన ప్రవర్తించే విధానంతో అది తెలుస్తుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, సినీ నటుడు చిరంజీవిపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. స్వయం శక్తితో సినీ దిగ్గజంగా ఎదిగిన చిరంజీవిపై అసెంబ్లీలో ఏకవచనంగా మాట్లాడడం సబబు కాదన్నారు. అసెంబ్లీలో హుందాగా ప్రవర్తించకుండా సభా మర్యాదలు పాటించకుండా జేబులో చేతులు పెట్టుకొని నోటికి ఏ మాట వస్తే ఆ మాట మాట్లాడిన బాలకృష్ణపై స్పీకర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బకాయిలకు ఓటీఎస్ అమలు చేయాలి

మామిడికుదురు: వాయిదా మీరిన బకాయిలకు ఓటీఎస్ అమలు చేయాలని కోరుతూ మామిడికుదురు సొసైటీ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశారు. చైర్మన్ ఈలి శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం సొసైటీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. సొసైటీలో వాయిదా మీరిన బకాయిలు సుమారు రూ.3 కోట్లు పైబడి ఉన్నాయని సీఈఓ అడబాల పెద్దిరాజు తెలిపారు. వీటి వసూలు సక్రమంగా జరగడం లేదన్నారు. రైతు నేస్తం పథకం ద్వారా ఎకరానికి రూ.8 లక్షలు వరకు రుణం ఇచ్చేందుకు చర్యలు చేపట్టామని చైర్మన్ తెలిపారు. దాత ఇచ్చిన స్థలంలో నిర్మించిన సొసైటీ భవనం పాడైపోయిందన్నారు. చుట్టూ ఉన్న ప్రహరీ కూడా దెబ్బతిందని చెప్పారు. వాటిని పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సొసైటీ ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు విక్రయిస్తామన్నారు. సభ్యులు కాకి శ్రీనివాస్, మట్టా సత్తిబాబు, పలువురు రైతులు సమావేశంలో పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధుల అవసరం

అంబాజీపేట: గ్రామ పంచాయతీలు సొంతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేయాలంటే నిధులు అవసరమని ఎంపీడీఓ బి.మమత అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీల ఆదాయ వనరులపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు రెండో రోజు శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ, పంచాయతీలు సొంతంగా ఆదాయం సమకూర్చుకోవడం వల్ల గ్రామాలకు అవసరమైన రహదారులు, డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనులు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కె.శ్రీనివాస్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా పయనించాలి

ఆలమూరు: పంచాయతీలు సొంత వనరుల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకుని అభివృద్ధి దిశగా పయనించాలని ఎంపీడీఓ రాజు అన్నారు. ఎంపీపీ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు సొంత వనరులు- అభివృద్ధి అనే అంశంపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమాలు శనివారం ముగిశాయి. పంచాయతీ పాలకవర్గాలు ప్రజలకు ఎటువంటి బారాన్ని మోపకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఆదాయ వనరులను సమకూర్చుకోవాలని సూచించారు. అనంతరం గ్రామాల వారీగా చేపడుతున్న అభివృద్ధి పనుల ప్రగతిని తెలుసుకుని పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సూపరింటెండెంట్ మెహెర్ ప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు, జేఈలు షేక్ వలీ, కె.సతీష్ పాల్గొన్నారు.

రోడ్డు.. బ్యాడ్..!

- భారీ వాహనాల రాకపోకలతో రహదారి ఛిద్రం
- వర్షాలకు మూసుకుపోయిన బెర్మ్‌లు
- వెదురుమూడి రోడ్డులో ప్రతి రోజూ ప్రమాదాలే

ఆలమూరు: దశాబ్దాల కాలంగా కొత్తూరు- వెదురుమూడి రోడ్డు నిర్లక్ష్యపు చెరలో కొట్టుమిట్టాడుతోంది. ఒకప్పుడు పదుల సంఖ్యలో ప్రయాణించే ఈ రహదారిలో ప్రతి రోజూ వందలాది వాహనాల రాకపోకలు సాగిస్తున్నా.. పరిస్థితిలో మాత్రం మార్పు రావడం లేదు. రహదారి అభివృద్ధి చెందకపోగా.. బెర్మ్‌లు విరిగిపోయి గుంతలమయంగా మారి రోజురోజుకు కునారిల్లిపోతుంది. కొత్తపేట, మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని పలు మండలాలకు ముఖ్య కూడలిగా ఉన్న ఈ రహదారిని విస్తరించకపోవడంతో ప్రయాణికులకు, పాదచారులు అనేక అవస్థలు పడుతున్నారు. ఐదు కిలోమీటర్ల పొడవు ఉన్న ఈ రహదారి అత్యధిక భాగం కపిలేశ్వరపురం మండలంలోనే ఉంది. ఇరు నియోజకవర్గాలకు చెందిన రహదారి కావడం వల్లే ఈ దుస్థితి దాపురించిందనే అభిప్రాయం సామాన్య ప్రజానీకం నుంచి వ్యక్తమవుతుంది. ఈ రహదారిలో ఒక పక్క పంట కాలువ, మరో పక్క పంట చేలు ఉండటంతో తరచూ కృంగిపోతుంది. మూడున్నర మీటర్లు వెడల్పు కలిగిన ఇలాంటి ఇరుకైన రోడ్డులో అనునిత్యం భారీ వాహనాలు ప్రయాణించడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. కొద్దిపాటి వర్షానికే రహదారి చిత్తడిగా మారడంతో వాహనదారులు అనేక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇరు వైపుల ఉన్న బెర్మ్‌లు పూడికతో మూసుకుపోవడంతో మొక్కలు పెరిగిపోయి చిట్టడవిగా తయారైంది.

పారిశ్రామిక వాడగా కార్యరూపం దాల్చుతున్నా..

రహదారి వెంబడి ఉన్న ఆలమూరు, కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలాల్లోని పలు గ్రామాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నా రహదారుల విషయంలో ఆ మేరకు సౌకర్యాల కల్పన జరగడం లేదు.



భారీ వర్షాలకు నీరు నిలిచిపోవడంతో బురదమయంగా రహదారి



కొత్తూరు- వెదురుమూడి రోడ్డులోని పంట కాలువలో పడిపోయిన పాల వాహనం (ఫైల్)



కొత్తూరు- వెదురుమూడి రోడ్డులో భారీ వాహనాల సంచారం

నిద్రావస్థలో ఆర్‌అండ్‌బీ శాఖ

కొత్తూరు- వెదురుమూడి రహదారి దారుణంగా ఉన్నా.. ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు పట్టించుకోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఈ రహదారి దుస్థితిపై అనేక మార్లు ఆర్‌అండ్‌బీ శాఖ దృష్టికి తీసుకెళ్లి కనీసం మరమ్మతులు చేపట్టాలని సూచించినా ప్రయోజనం లేకపోయిందని పలువురు ప్రజాప్రతినిధులు ఆవేదన చెందుతున్నారు. ఏళ్ల తరబడి ఈ రహదారి మరమ్మతులకు కూడా నోచుకోకపోవడం విమర్శలకు తావిస్తుంది. ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు ఓఎన్‌జీసీ అధికారులతో పాటు స్థానిక పారిశ్రామిక వేత్తల భాగస్వామ్యంతోనైనా కనీసం మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కొన్ని చోట్ల గృహ యజమానులు మెరక వేసుకోవడంతో వర్షపు నీరు నిలిచిపోయి రహదారులు దెబ్బతినడానికి కారణమవుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఈ రహదారి వెంబడి ఓఎన్‌జీసీకి చెందిన తొమ్మిది చమురు, సహజ వాయువు అన్వేషణ బావులు, పేపరు మిల్లుతోపాటు, అనేక రైసు మిల్లులు కూడా ఉన్నాయి. దీంతో ప్రతిరోజు భారీ వాహనాలు రావడంతో గంటల కొద్ది ట్రాఫిక్ నిలిచిపోతుంది. ఇటీవల మళ్లీ పినపళ్ల భూభాగం పరిధిలో కొత్తగా ఓఎన్‌జీసీ కార్యకలాపాలను ప్రారంభించడం వల్ల రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. కొద్దిపాటి వర్షానికే రహదారిలోని గోతులు జలమయం అవుతున్నాయి. దీని వల్ల గోతులు గుర్తించని వాహనదారులు ప్రమాదాలకు గురై క్షతగాత్రులవుతున్నారు. ఇటీవల కపిలేశ్వరపురం మండలంలోని అచ్యుతాపురానికి చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గత పదేళ్లలో ఈ రహదారిలో జరిగిన ప్రమాదాల్లో దాదాపు ఐదుగురు చనిపోవడం పరిస్థితికి అద్దం పడుతుంది. అలాగే గతేడాది ఒక ప్రైవేట్ మిల్క్ డైరీకి చెందిన వాహనం పంట కాలువలో పడిపోయి రెండు రోజుల తరువాత కానీ బయటకు రాలేని పరిస్థితి నెలకొంది.

వర్షాలు తగ్గాక మరమ్మతులు చేపడతాం

వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే కొత్తూరు- వెదురుమూడి రోడ్డు మరమ్మతులు చేపట్టనున్నాం. ఆ రహదారి విస్తరణకు ఇప్పటికే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. తాత్కాలిక మరమ్మతుల కోసం టెండర్ల ప్రక్రియను పూర్తి చేస్తున్నాం.

– సూర్యనారాయణ, ఇన్‌చార్జ్ ఆర్‌అండ్‌బీ జేఈ, రామచంద్రపురం.

పరిశ్రమ ఏర్పాటు అభినందనీయం



కేశనపల్లిలో జ్యూట్ బ్యాగులను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేశ్ కుమార్

మలికిపురం: పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిర్మూళనలో భాగంగా జ్యూట్ బ్యాగుల పరిశ్రమ ఏర్పాటు అభినందనీయమని కలెక్టర్ మహేశ్ కుమార్ అన్నారు. కేశనపల్లిలో డీఆర్‌డీఏ సహకారంతో తోట ఉమామహేశ్వరి ఏర్పాటు చేసిన జ్యూట్ పరిశ్రమను శనివారం పరిశీలించారు. ఉమామహేశ్వరిని కలెక్టర్ అభినందించి పరిశ్రమ ఏర్పాటుపై మాట్లాడారు. మొదట సొంత నిర్ణయంతో జ్యూట్ బ్యాగుల తయారీ ప్రారంభించానని, బ్యాగుల తయారీకి ముడి సరకులు కలకత్తా నుంచి దిగుమతి చేసి నాలుగు యూనిట్లలో తనతోపాటు మరో 20 మంది మహిళలు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. నాబార్డు ద్వారా 30 మందికి బ్యాగుల తయారీపై శిక్షణ కూడా ఇచ్చినట్లు తెలిపారు. డీఆర్‌డీఏ ఆర్థిక సహకారంతో యూనిట్లు స్థాపించామన్నారు. ఉత్పత్తులను డీఆర్‌డీఏ మాల్స్, పాఠశాలలో స్కూల్ బ్యాగులు తయారుచేసి స్థిరమైన ఆదాయాన్ని పొందుతున్నామన్నారు. మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలను సృష్టించడంలో ఇవి ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఏ పీడీ జయచంద్ర గాంధీ, తహసీల్దారు టి.శ్రీనివాసరావు, ఏపీఎం సయాద్, సర్పంచ్‌లు యెనుముల నాగు, గుర్లింక సత్తిబాబు, అడబాల సాయి, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద ఫ్లెక్సీలు తొలగించండి

మామిడికుదురు: గ్రామాల్లో వివాదాలకు కారణమవుతున్న ఫ్లెక్సీలను తొలగించాలని నగరం ఎస్ఐ చైతన్య కుమార్ సూచించారు. ఎంపీపీ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు జరుగుతున్న శిక్షణా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో ఫ్లెక్సీలపై రాసిన రాతలు శాంతి భద్రతల సమస్యగా మారాయన్నారు. వివాదాస్పద కొటేషన్లతో ఏర్పాటు చేసే ఫ్లెక్సీలను ఎట్టి పరిస్థితుల్లోనూ గ్రామాల్లో ఏర్పాటు చేయకుండా కట్టడి చేయాలన్నారు. దీనిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ బి.భవాని, డిప్యూటీ ఎంపీడీఓ అడబాల శ్రీనివాస్, ఏఓ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రోన్‌తో జీవామృతం పిచికారీ

పి.గన్నవరం: రైతులు యాంత్రీకరణ పద్ధతులను అవలంబించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులను సాధించాలని ఏఓ సీహెచ్‌డీ విజయ కుమార్ అన్నారు. ఆర్.ఏనుగుపల్లిలో రైతు సూర్యనారాయణ రాజుకు చెందిన ఐదు ఎకరాల విస్తీర్ణంలోని వరి చేలకు శనివారం డ్రోన్ ద్వారా జీవామృతం ద్రావణాన్ని పిచికారీ చేశారు. గ్రోమోర్ కంపెనీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన డ్రోన్ టెక్నాలజీని ఆయన పరిశీలించి పలు సూచనలిచ్చారు. ప్రకృతి వ్యవసాయ విభాగం మాస్టర్ ట్రైనర్ జె.నాగవేణి, యూనిట్ ఇన్‌చార్జ్ బి.నారాయణ రావు, వీహెచ్ఏ సురేష్, వీఏఏ రాజేష్ పాల్గొన్నారు.

వరద ఉధృతితో రైతులకు కష్టాలు



అప్పనపల్లి స్నానాల రేవులో పరవళ్లు తొక్కుతున్న గోదావరి వరద

మామిడికుదురు: గోదావరి వరద ఉధృతి శనివారం మరింత పెరిగింది. దీంతో రైతుల కష్టాలు రెట్టింపు అయ్యాయి. పెదపట్నం, పెదపట్నంలంక గ్రామాలకు చెందిన రైతులు పచ్చగడ్డి కోసం అష్టకష్టాలు పడుతూ నాటు పడవల్లో మధ్య లంకలోకి వెళ్తున్నారు. రెండు నెలల నుంచి గోదావరి వరద తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాశర్లపూడి ఏటిగట్టు దిగువన కాజ్‌వేకు రెండు వైపులా వరద నీరు చుట్టుముట్టింది. వరద మరింత పెరిగే అవకాశం ఉండటంతో కాజ్‌వే ముంపు బారిన పడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. వరద హెచ్చరికల నేపథ్యంలో పెదపట్నం, అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భద్రాచలం వద్ద శనివారం గోదావరి వరద తగ్గుముఖం పట్టడంతో తీర గ్రామాల ప్రజలు కొంత ఊరట చెందారు.

అయినవిల్లి: మండలంలోని లంక గ్రామాల్లో వరద ఉధృతి క్రమేపీ పెరుగుతోంది. ముక్తేశ్వరం- కోటిపల్లిరేవులో వరద నీరు ఉధృతిగా ప్రవహిస్తుంది. ముక్తేశ్వరంలో వృద్ధ గౌతమి పాయపై ఉన్న పాత వంతెన వరద నీట మునిగింది. దీంతో లంక గ్రామాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ముక్తేశ్వరం- అయినవిల్లిలంక మధ్య కాజ్‌వేను వరద నీరు చుట్టుముట్టింది. దీంతో లంక గ్రామాల ప్రజలకు రాకపోకలు స్తంభించే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో కూరగాయ పంటలు వరద నీటి మునిగాయి. పల్లపు ప్రాంతాల్లో ఉన్న పశువులను మేరక ప్రాంతాలకు రైతులు తరలించారు.

పెరుగుతున్న ప్రవాహం

ఆలమూరు: గౌతమీ గోదావరికి వరద ఉధృతి మళ్లీ పెరుగుతోంది. ఈ ఏడాది ఇప్పటికే నాలుగు సార్లు వరద రాగా శనివారం మళ్లీ వరద గంటగంటకు పెరుగుతుండటంతో ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద ఇరిగేషన్ శాఖ తొలి ప్రమాద హెచ్చరికను జారీ చేసింది. దీంతో వరుస వరదల ఉధృతితో లంక వాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

సంక్షేమ పాలన కోసం కృషి చేద్దాం



అంతర్వేదిలో పార్టీ జెండా ఆవిష్కరించిన పాపారాయుడు, గొల్లపల్లి సూర్యారావు

సఖినేటిపల్లి: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన తిరిగి రాష్ట్రంలో తెచ్చుకునేందుకు కార్యకర్తలంతా కష్టపడి పని చేద్దామని రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు కర్రి పాపారాయుడు అన్నారు. పరిశీలకులుగా నియమింపబడి తొలిసారి నియోజకవర్గానికి వచ్చిన ఆయన అంతర్వేదిలో లక్ష్మి నరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అంతర్వేది దేవస్థానంలో నక్క రామారావు ఇంటి వద్ద పార్టీ జెండావిష్కరణ చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, పార్టీలో కష్టపడి పని చేసిన వారందరికీ తగిన గుర్తింపు ఇచ్చే విధంగా అధినేత జగన్ చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ చాలా బలంగా ఉందన్నారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఎక్కడా లేని విధంగా విజయవంత మైందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ డొల్లతనం రానురాను బయట పడుతుందన్నారు. ప్రశ్నించే వారిని వేధించడం తప్ప కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు ఏమీ లేవన్నారు. కూటమి కుతంత్రాలను ఎదుర్కొనేందుకు పార్టీ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దన్నారు. గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ, కర్రి పాపారాయుడు వంటి సమర్థ నాయకుడిని రాజోలుకు పరిశీలకులుగా జగన్ నియమించారని అన్నారు. సమావేశంలో డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చిన్నరాజా, రాష్ట్ర కార్యదర్శి పాటి శివకుమార్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి ఆదిత్య కుమార్, జెడ్పీటీసీలు బల్ల ప్రసన్న కుమారి, మట్టా శైలజ, నాయకులు కెఎస్ఎన్ రాజు, కంచర్ల శేఖర్, తెన్నేటి కిషోర్, కుసుమ చంద్రశేఖర్, తెన్నేటి కిషోర్, గోకాడ రాజశేఖర్ రెడ్డి, కుడుపూడి రాంబాబు, సాధనాల శివ భగవాన్, ముప్పర్తి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు



కొత్తపేటలో ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు శాస్త్రి, శ్రీధర్

కొత్తపేట: రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదని న్యాయవాదులు, కొత్తపేట, పి. గన్నవరం నియోజకవర్గాల వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షులు చావలి సుబ్బరాయ శాస్త్రి, రాణి శ్రీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం స్థానిక ఆర్డీఓ శ్రీకర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు కూటమి ప్రభుత్వం టెండరు నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. చంద్రబాబు తన పాలనలో ఒక్క మెడికల్ కాలేజీ కూడా స్థాపించలేదన్నారు. జిల్లాకో మెడికల్ కాలేజీ ఉండాలనే ఉద్దేశంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019- 2024 హయాంలో రాష్ట్రంలో 17 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. 10 కాలేజీలను పీపీపీ మోడల్‌లో అభివృద్ధి చేయాలని నిర్ణయించి, టీడీపీ పారిశ్రామిక వేత్తలకు, తమ తాబేదార్లకు కూటమి ప్రభుత్వం కట్టబెడుతున్నారని మండిపడ్డారు. ఈ విధానంతో పేద, సామాన్య విద్యార్థులకు వైద్య విద్యను ప్రభుత్వం దూరం చేస్తుందన్నారు. కమీషన్ల కోసం మెడికల్ కాలేజీలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేస్తున్నారని విమర్శించారు. ఈ విధానం ఉప సంహరించుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఇల్లాలి ఆరోగ్యం.. ఇంటింటా సౌభాగ్యం



పలివెలలో సామూహిక సీమంతాలు చేసిన ఎంపీపీ గంగాధరరావు

అంబాజీపేట: ఆరోగ్యవంతమైన సమాజం మహిళలతోనే సాధ్యమని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. గంగలకుర్రులో స్వస్థ్ నారీ- సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ, వంటిల్లే వైద్యశాల అన్న విధంగానే మహిళలు వండే మంచి ఆహార పదార్థాలు తినడం ద్వారా ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

కొత్తపేట: ఆరోగ్యవంతమైన సమాజం మహిళలతోనే సాధ్యమని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. స్వస్థ్ నారీ- సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలివెలలో ఉచిత వైద్య శిబిరం, గర్భిణులకు సామూహిక సీమంతాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అవిడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ గంగాధరరావు పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు తులా సూర్య నారాయణ, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలమూరు: ఆడబిడ్డల ఆరోగ్యాన్ని పరిరక్షించుకొని ఇంటింటా సౌభాగ్యాన్ని పెంపొందించుకోవాలని కొత్తపేట ఎడిషనల్ డీఎంహెచ్ఓ ఎం.సుమలత అన్నారు. మండలంలోని సూర్యారావుపేట, బడుగువానిలంక గ్రామాల్లో పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సాయికిషోర్, ఎస్.లక్ష్మీ స్నేహలత ఆధ్వర్యంలో జరిగిన స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. చిన్నారులకు టీకాలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

మామిడికుదురు: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఏంఏ వేమా సూచించారు. ఆదుర్రు, బి.దొడ్డవరంలో శనివారం ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబ కార్యక్రమం జరిగింది. గ్రామాల్లో ఏర్పాటు చేసిన శిబిరాలను సర్పంచ్‌లు శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం ప్రారంభించారు.

శనైశ్చరునికి భక్తుల తైలాభిషేకాలు

దేవస్థానానికి రూ 1.14 లక్షల ఆదాయం

కొత్తపేట: శని దోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. దేవస్థానం ఈఓ దారపురెడ్డి సురేష్‌బాబు ఆధ్వర్యంలో స్వామివారి పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముందుగా ప్రాతఃకాల సమయంలో ఆలయ ప్రధాన అర్చకుడు అయిలూరి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. భక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగా తైలాభిషేకాలు, పూజల ద్వారా దేవస్థానానికి రూ1,18,185 అన్నప్రసాదం విరాళాలు రూపంలో రూ.23,522తో కలిపి మొత్తం రూ.1,14,707 ఆదాయం వచ్చినట్టు ఈఓ తెలిపారు.

జనార్దనస్వామికి ప్రత్యేక పూజలు

ఆలమూరు: గ్రామంలో ఉన్న అతి ప్రాచీన దేవాలయం, నవ జనార్దన దేవాలయాల్లో ఒకటైన శ్రీదేవి,భూదేవి సమేత జనార్దన స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రభాకరచార్యుల నేతృత్వంలో పురోహితుల బృందం అందించిన తొలి హారతి భక్తులను మంత్రముగ్ధులను చేసింది.

లక్ష్మీదేవికి లక్ష కుంకుమార్చనలు

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరంలోని ముక్తికాంతక్షణ ముక్తేశ్వర స్వామి ఆలయంలో కొలువైన లక్ష్మీదేవికి శరన్నవరాత్రుల్లో భాగంగా శనివారం లక్ష కుంకుమ పూజలు జరిపారు. అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు చేశారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కానుకలు, మొక్కుబడులు చెల్లించారు. అలాగే విలసలో కనకదుర్గమ్మ, ముక్తేశ్వరంలోని ముక్తికాంతమ్మకి, తొత్తరమూడి రాజరాజేశ్వరీదేవికి, నేదునూరు సర్వమంగళ పార్వతీదేవికి విశేష పూజలు జరిపారు.

వెంకన్న ఆలయానికి..

మండలంలోని నల్లచెరువులో ఉన్న అలిమేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితులు ఆధ్వర్యంలో తెల్లవారు జామున తోమల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు.

వేద పండితులు స్వామికి తులసి పూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

బాలాజీ దర్శనానికి..

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయానికి శనివారం భక్తులు భారీగా తరలివచ్చారు. కలియుగ ప్రత్యక్ష దైవంగా ఆరాధించే స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. బాలాజీ స్వామి భక్తులకు నయనానందకరంగా దర్శనమిచ్చారు. ప్రాతః కాలంలో ఆలయ అర్చకులు సుప్రభాత సేవ అనంతరం తొలి హారతిని వేద మంత్రాలతో ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.2,77,640 ఆదాయం వచ్చిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. నిత్య అన్నదానం ట్రస్టుకు రూ.64,626 విరాళాలుగా అందించారన్నారు. 5,500 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని, 3,100 మంది స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారని తెలిపారు.

మన లెక్కల యాప్‌పై అవగాహన

రావులపాలెం: స్థానిక మండల మహిళా కార్యాలయం వద్ద అమృత వర్షిణి మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులతో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఎస్‌హెచ్‌సీ కోసం ప్రవేశపెట్టిన ×మన డబ్బులు- మన లెక్కల్లు యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ యాప్ ద్వారా మహిళలు తమ పొదుపు, అప్పుల వివరాలను పారదర్శకంగా తెలుసుకోవచ్చని అధికారులు వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో మహిళా సాధికారతకు తోడ్పడే ఉద్దేశ్యంతో రూపొందించిన ఈ యాప్ గురించి అధికారులు వివరించారు. ఉమెన్ పవర్ అనే ఈ యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, దీని ద్వారా సభ్యులు తమ వ్యక్తిగత ఐడి నంబర్ ఉపయోగించి ఆర్థిక లావాదేవీల వివరాలను సులభంగా తెలుసుకోవచ్చునన్నారు. దీని వల్ల మోసాలకు తావు ఉండదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం కె.విజయ్, క్లస్టర్ సీసీ అలివేలు మంగమ్మ, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి శిక్షణపై దృష్టి సారించండి

మామిడికుదురు: విద్యతో పాటు వృత్తి శిక్షణ అంశాలపై కూడా అవగాహన కలిగి ఉండాలని మామిడికుదురు జెడ్పీహెచ్ స్కూల్ హెచ్ఎం చిరంజీవి రావు సూచించారు. ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన వృత్తి శిక్షణా కోర్సుల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు శనివారం ఇంటర్న్‌షిప్ శిక్షణ ఇచ్చారు. పీఎంశ్రీ పథకంలో భాగంగా ఈ స్కూల్లో వృత్తి శిక్షణా కోర్సులు నిర్వహిస్తున్నారు. దసరా సెలవుల్లో పలు షాపుల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. వృత్తి విద్య శిక్షకులు వై.మధు రిటైల్ రంగానికి చెందిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. మార్కెటింగ్ తదితర అంశాలను ప్రయోగాత్మకంగా చూపించారు. ఫుడ్ ప్రాసెసింగ్ ట్రైనర్ జె.మోనికాకృష్ణ పలు అంశాలపై అవగాహన కల్పించారు.

ఆకట్టుకున్న మయసభ నాటకం

రాజోలు: విజయదశమి ఉత్సవాల్లో భాగంగా శివకోటి కందికట్టు వారి గ్రూపు కనకదుర్గమ్మ ఆలయం వద్ద ప్రదర్శించిన మహాభారతంలోని మయసభ నాటకం ఆకట్టుకుంది. న్యాయవాది యాలంగి రమేష్ అద్భుతంగా నటించారు. సుమిత్ రామారావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక నాటికలు, ప్రదర్శనలు చేస్తున్నామని ఆయన తెలిపారు. మాజీ ఎంపీ బుచ్చిమహేశ్వరరావు, హైకోర్టు న్యాయవాది ముషిణి రామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు చింతా ప్రసాద్, రావి విజయ్ తదితరులు రమేష్‌ను ఘనంగా సత్కరించారు.

లలితా త్రిపుర సుందరిగా దుర్గమ్మ

మామిడికుదురు: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా 6వ రోజు శనివారం అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పాశర్లపూడిబాడవ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి సన్నిధిలో శ్రీమహాలక్ష్మీ దేవి శ్రీధనలక్ష్మీదేవిగా భక్తులకు కనువిందు చేశారు. మామిడికుదురు విజయ దుర్గమ్మకు కనకాంభరాలతో విశేష అర్చన జరిపించారు. పెదపట్నంలంక కనకదుర్గమ్మ కాత్యాయని అలంకారంలో భక్తులకు కనువిందుగా దర్శనమిచ్చారు.

కొత్తపేట: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా 6వ రోజు శనివారం గ్రామ గ్రామాన కనకదుర్గాదేవి ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో అమ్మవార్ల రోజుకో అలంకరణలో భాగంగా స్థానిక బొరుసువారిసావరం విజయకనకదుర్గాదేవి అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ దేవత బంగారమ్మ అమ్మవారిని, ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత వాసవీకన్యకా పరమేశ్వరీ అమ్మవారిని వివిధ అవతారాల్లో అలంకరించారు.

అంబాజీపేట: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా స్థానిక బస్ స్టేషన్ వద్ద ఉన్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు శనివారం భక్తులకు శ్రీబాలాత్రిపుర సుందరి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు చంద్రమౌళి సుబ్రహ్మణ్య శర్మ బ్రహ్మత్వంలో చంద్రమౌళి ధనుష్, కామేష్ శర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాచవరం శివారు కోటి వారి అగ్రహారంలో ఉన్న శ్రీభువనేశ్వరి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు గాయత్రి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



పెదపట్నంలంకలో కాత్యాయనిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ